# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 26-09-2025** **సమయం : 1.20 గంటలు**

# ముఖ్యాంశాలు

1. ఇంద్రకీలాద్రిపై ఈ రోజు శ్రీ మహాలక్ష్మీదేవి అలంకారంలో దర్శనమిస్తున్న కనకదుర్గ అమ్మవారిని రాష్ట్ర గవర్నర్ ఎస్ అబ్దుల్ నజీర్ దర్శించుకున్నారు.

2. అల్పపీడనం ప్రభావంతో ఉభయ తెలుగు రాష్ట్రాల్లో మోస్తారు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ తెలిపింది.

3. వర్షాలపై వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలని హెూం శాఖ మంత్రి వి.అనిత అధికారులను ఆదేశించారు.

4. సంక్షేమ వసతి గృహాల అభివృద్ధికి ప్రభుత్వం చర్యలు చేపడుతోందని సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోల శ్రీ బాల వీరాంజనేయ స్వామి తెలిపారు.

===========================

విజయవాడ ఇంద్రకీలాద్రిపై కొలువైన కనకదుర్గ అమ్మవారీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో అయిదో రోజున శ్రీ మహాలక్ష్మీదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిస్తున్నారు. అమ్మవారిని రాష్ట్ర గవర్నర్ ఎస్ అబ్దుల్ నజీర్ ఈ రోజు దర్శించుకున్నారు. గవర్నర్ కు దేవాదాయ శాఖ కమిషనర్ రామచంద్ర మోహన్, ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ జి.లక్ష్మీశ, ఆలయ కార్యనిర్వహణాధికారి వీకే శీనా నాయక్ స్వాగతం పలికారు.

ఇదిలా ఉండగా మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి అమ్మవారిని దర్శించుకున్నారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ,రాష్ట్ర ప్రభుత్వం చేసిన ఏర్పాట్ల పట్ల భక్తులు సంతృప్తి వ్యక్తం చేస్తున్నారని చెప్పారు. దసరా ఉత్సవాలను విజయవంతం చేసేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేస్తున్నాయని మంత్రి తెలిపారు.

-------------------------

ఉపరితల ఆవర్తనం ప్రభావంతో ఉత్తర మధ్య బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడిందని ఇది పశ్చిమ దిశగా కదులుతూ దక్షిణ ఒడిశా-ఉత్తరాంధ్ర తీరాల ఆనుకుని వాయుగుండంగా బలపడే అవకాశం ఉందని అమరావతి వాతావరణ కేంద్రం వెల్లడించింది. దీని ప్రభావంతో ఆంధ్రప్రదేశ్ లోని ఉత్తరాంధ్ర, ఏలూరు, కృష్ణా, ఎన్టీఆర్, గుంటూరు జిల్లాల్లో అక్కడక్కడ భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసేందుకు అవకాశం ఉందని వాతారవరణ శాఖ అధికారి ఎం. వెంకట్రావు. తెలియజేస్తూ,

వాయిస్ 24 సెకన్లు

----------------------------

బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం వాయుగుండంగా బలపడే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలని హోం శాఖ మంత్రి వి.అనిత అధికారులను ఆదేశించారు. ఈ మేరకు అమరావతి నుంచి జిల్లాల కలెక్టర్లతో మంత్రి ఈ రోజు సమీక్ష నిర్వహించారు. ఈ సంధర్భంగా ఆమె మాట్లాడుతూ, వాతావరణ పరిస్థితులను ఎదుర్కునేందుకు క్షేత్రస్థాయిలో అధికారులు సిద్ధంగా ఉండాలని సూచించారు. కంట్రోల్ రూమ్స్ ఏర్పాటు చేయాలని, ప్రమాదకర ప్రాంతాల్లో హెచ్చరిక సూచికలను ఏర్పాటు చేయాలన్నారు. సహాయక చర్యలకు విపత్తు నిర్వహణ బృందాలను సిద్ధంగా ఉంచాలని మంత్రి ఆదేశించారు.

----------------------------

తిరుమలలో శ్రీవెంకటేశ్వరస్వామి వారి సాలకట్ల బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఇందులో భాగంగా ఈ ఉదయం మలయప్ప స్వామివారు సింహ వాహనంపై యోగముద్ర అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. పెద్ద సంఖ్యలో భక్తులు స్వామివారి వాహనసేవలో పాల్గొని కర్పూర హారతులు సమర్పించారు. ఈ రోజు రాత్రి 7 గంటలకు స్వామివారు ముత్యపు పందిరి వాహనంపై భక్తులకు దర్శనమివ్వనున్నారు.

----------------------------

ప్రజాసేవ, సుపరిపాలనకు ప్రాధాన్యమిస్తూ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నేతృత్వంలోని ఎన్డీయే ప్రభుత్వం భారత్ ను అభివృద్ధి చెందిన దేశంగా మార్చేందుకు కృషి చేస్తోంది. “సేవా పర్వ్” పేరుతో ఆకాశవాణి విజయవాడ ప్రాంతీయ వార్తా విభాగం ప్రత్యేక కథనాలను అందిస్తోంది. భారతదేశాన్ని ప్రపంచ మీడియా కేంద్రంగా మార్చేందుకు కేంద్రప్రభుత్వం నిర్వహించిన వేవ్స్ సదస్సు గురించి ఈ రోజు తెలుసుకుందాం.

వాయిస్ ఓవర్ (01 :30)

----------------------------

సంక్షేమ వసతి గృహాల అభివృద్ధికి ప్రభుత్వం చర్యలు చేపడుతోందని సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోల శ్రీ బాల వీరాంజనేయ స్వామి తెలిపారు. శాసనసభ సమావేశాల్లో భాగంగా సంక్షేమ వసతి గృహాలపై శాసనసభ్యులు అడిగిన ప్రశ్నకు మంత్రి సమాధానమిస్తూ, రాష్ట్ర ప్రభుత్వం 104 కోట్ల రూపాయలతో నూతన వసతి గృహాలను ఏర్పాటు చేయనుందని తెలిపారు.

వాయిస్ 22 సెకన్లు

----------------------------

డిజిటల్ భారత్ నిధి ద్వారాదే శవ్యాప్తంగా ఏర్పాటు చేసిన భారత్ సంచార్ నిగమ్ లిమిటెడ– బిఎస్ఎన్ఎల్ 4జి టవర్లను ప్రధానమంత్రి నరేంద్ర మోదీ దృశ్య మాధ్యమం విధానంలో రేపు ప్రారంభించనున్నారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో 2,641 టవర్లను ప్రారంభిస్తారని బిఎస్ఎన్ఎల్ ఆంధ్రప్రదేశ్ సర్కిల్ చీఫ్ జనరల్ మేనేజర్ సింహాచలం తెలిపారు. విజయవాడలో ఆయన ఈ రోజు మాట్లాడుతూ, ఈ టవర్ల ద్వారా రాష్ట్రంలో 21 లక్షల 50 వేల మందికి పైగా ప్రజలకు బిఎస్ఎన్ఎల్ 4 జి నెట్వర్క్ సేవలు అందుబాటులోకి వస్తాయని చెప్పారు.

----------------------------

“స్వస్థ్ నారీ స్వశక్తి పరివార్ అభియాన్” కార్యక్రమంలో భాగంగా తిరుపతి జిల్లా వ్యాప్తంగా పోషణ్ అభియాన్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా శ్రీకాళహస్తిలోని భాస్కరపేట అంగన్వాడి కేంద్రంలో మహిళలకు ఈ రోజు పౌష్టిక ఆహారాలతో వంటల పోటీలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తిరుపతి జిల్లా మహిళా, శిశు సంక్షేమ శాఖ అధికారి శాంతిదుర్గ పాల్గొని విజేతలకు బహుమతులు అందజేశారు. మహిళలకు ఆరోగ్య సమస్యలు, పౌష్టికాహార ప్రాధాన్యతపై అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నామని శాంతిదుర్గ ఈ సందర్భంగా తెలియజేస్తూ,

వాయిస్ 24 సెకన్లు

---------------------------

రాష్ట్రంలో రైతులకు సూక్ష్మ సేద్య పరికరాల మంజూరులో అనంతపురం జిల్లా అగ్రస్థానంలో నిలిచిందని జిల్లా సూక్ష్మ సేద్య పథకం సంచాలకులు రఘునాథ్ రెడ్డి తెలిపారు. అనంతపురంలో ఆయన ఈ రోజు పాత్రికేయులతో మాట్లాడుతూ, 2024 – 2025 సంవత్సరంలో ఆంధ్రప్రదేశ్ సూక్ష్మ సేద్య పథకం–ఏపీఎంఐపి ద్వారా జిల్లాకు నిర్దేశించిన 18000 హెక్టార్లలకు గాను 17,642 హెక్టార్లలో సేద్య పరికరాలను మంజూరు చేశామని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం సూక్ష్మ సేద్య పరికరాలపై వస్తు, సేవల పన్ను –జీఎస్టీని 5 శాతానికి తగ్గించిందని ఈ మార్పు ద్వారా వ్యవసాయ పరికరాలు మరింత అందుబాటులోకి వచ్చాయన్నారు. ఏపీఎంఐపి పథకాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

======================